
సాక్షి
అనకాపల్లి
గురువారం : 4 : మే : 2023



52వసారి రక్తదానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం డీజీఎం కర్రి శ్రీనివాస్ 52వ సారి రక్తదానం చేశారు.



5న బుద్ధ పూర్ణిమ

విశాఖ: ఇసుకకొండపై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో 5న బుద్ధ పూర్ణిమ నిర్వహించనున్నారు.



నర్సింగ్ క్లోక్ రూమ్

విశాఖ: కేజీహెచ్‌లో నర్సుల కోసం రూ.2.5 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన క్లోక్ రూమ్‌ను బుధవారం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

రైతులకు ఈనెల 15 లోగా ఈకేవైసీ తప్పనిసరి

తుమ్మపాల: పీఎం కిసాన్ పథకంలో ఆర్థిక సహాయం పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. అర్హులైన రైతులు ఈ నెల 15వ తేదీలోగా కామన్ సర్వీస్ సెంటర్, ఆర్‌బీకేలలో ఈకేవైసీ చేసుకోవాలన్నారు. పెట్టుబడి సహాయంగా 14వ విడత నగదును ఈ నెలలోనే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,13,471మంది రైతులకు గాను 1,70,761మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారని, మిగిలిన 42,710 మంది త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

అనకాపల్లి క్రీడాకారిణికి పవర్‌లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్



పతకాలతో జ్యోత్స్న

అనకాపల్లి టౌన్: కేరళ రాష్ట్రం అల్పుజాలో ఈనెల 1వ తేదీ నుంచి 5 వరకు జరిగిన సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఏషియన్ చాంపియన్ షిప్‌లో సబ్ జూనియర్ విభాగంలో స్థానిక వేల్పులవీధి సీతారామ వ్యాయామ సంఘానికి చెందిన ఎ.జ్యోత్స్న 4 బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహించి దేశానికి బంగారు పతకాన్ని అందించడమే కాకుండా స్క్వాట్, బెంచ్ ప్రెస్‌లో మూడు బంగారు పతకాలు గెలుపొందారు. జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి బద్రి బుధవారం అభినందనలు తెలిపారు.

ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఈ-ఆఫీస్‌లోనే..

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

తుమ్మపాల: ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఈ-ఆఫీస్‌లోనే నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఆర్డీవో నుంచి ఎల్‌డీసీ వరకు అందరూ ఈ-ఆఫీస్‌ను అనుసరించాలన్నారు. రీ సర్వే, స్పందన, ధ్రువీకరణ పత్రాల జారీ, 22 ఎ తదితర పనులన్నీ వేగవంతం చేయాలని సూచించారు. స్పందన అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి పెంచేందుకు ప్రతి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సర్వేలో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ (సర్వే రాళ్లు వేయడం) విజయవంతమైందన్నారు. ఇదే స్ఫూర్తితో రెండో విడత భూముల రీ సర్వే కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో పి.వెంకటరమణ, జిల్లాలో తహసీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు రెండో జాబితా

సాక్షి, అనకాపల్లి: తొలి విడతగా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు పొందిన వారి రెండో జాబితాను బుధవారం జిల్లా అధికారులు విడుదల చేశారు. జిల్లాలో కొత్తగా 192 మంది విద్యార్థులకు అవకాశం లభించింది. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9వ తేదీ నాటికి ఆయా పాఠశాలల్లో చేరాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. మొదటి జాబితాలో 339 మంది ఎంపికైన విషయం తెలిసిందే. వీరంతా ఇప్పటికే పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. తొలి విడతలో రెండు జాబితాలు కలిపి 531మందికి సీట్లు దక్కగా.. రెండో విడతలో దరఖాస్తు చేసుకునేందుకు సైతం అవకాశం కల్పించింది. ఉచిత ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థులు ఈ నెల 6 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారంతా ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశం పొందేలా చూడాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఉచిత ప్రవేశాలకు గడువు పెంచిన విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఎండీకి ఫైనాన్స్ డైరెక్టర్ బాధ్యతలు



అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు డైరెక్టర్ (ఫైనాన్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతవరకు ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన వి.వి. వేణుగోపాలరావు ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయడంతో, ఆ బాధ్యతలను సీఎండీకి అప్పగించారు.

విశాఖ.. వైభోగం

- భోగాపురం ఎయిర్‌పోర్టు, అదానీ డేటా సెంటర్‌తో మారనున్న ముఖచిత్రం
- నాలుగు నెలల్లో వైజాగ్ – భోగాపురం ఆరులైన్ల రహదారి పనులు
- సీఎం జగన్ పర్యటనతో మురిసిన ఉత్తరాంధ్ర
- సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన : ముఖ్యమంత్రి పునరుద్ఘాటన



డేటా సెంటర్ నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన, డేటా సెంటర్‌కు భూమి పూజ చేసి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరాన్ని అభివృద్ధిలో మరో మెట్టు ఎక్కించారు. ఆర్థిక రాజధానిగా భాసిల్లుతున్నా.. ప్రధాన నగరాలతో అన్ని రంగాల్లో పోటీ పడుతున్నా.. ద్వితీయ శ్రేణి నగరంగానే మిగిలిపోయిన విశాఖను.. టైర్-1 సిటీల సరసన నిలబెట్టేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రగతి పరుగును ప్రారంభించారు. ముఖ్యమంత్రి పర్యటనతో మురిసిన ఉత్తరాంధ్ర.. ఇకపై తమ ప్రాంతాన్ని వలసల ప్రాంతమని కాకుండా, విప్లవాత్మక అభివృద్ధి కేంద్రంగా పిలవాలంటూ నినదించింది. సెప్టెంబర్ నుంచి ఇక్కడే పరిపాలన ప్రారంభిస్తానంటూ సీఎం పునరుద్ఘాటించడంతో ఇక్కడి ప్రజల్లో ఉత్సాహం మరింత జోరందుకుంది.

ప్రపంచంలో ఏ నగరం చూసుకున్నా కనెక్టివిటీతోనే అభివృద్ధి చెందింది. విశాఖలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నా భారత నౌకాదళంతో అనుసంధానమై ఉంది. దీంతో విదేశాలకు విమానాలు ఎగిరే అవకాశాలు తక్కువగా ఉండటంతో అభివృద్ధిలో అంతంతమాత్రంగానే మిగిలిపోయింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రాకతో ఇకపై ప్రపంచ దేశాలకు కనెక్టివిటీ పెరగనుంది. తద్వారా ఉత్తరాంధ్ర, సరిహద్దు జిల్లాలు అభివృద్ధి పథంలో పరుగులు పెట్టనున్నాయి. ఎయిర్‌పోర్టు రాకతో ఈ ప్రాంత ఎకానమీ మారనుంది. భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి 2026 నాటికి తొలి విమానం ఎగరనుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో.. ఉత్తరాంధ్రకు మంచిరోజులొచ్చాయని ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ ఎయిర్‌పోర్టును రూ.4,592 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

విశాఖ-భోగాపురం.. ఆరు లైన్ల రాదారి

పేరుకే భోగాపురం విమానాశ్రయం అయినప్పటికీ.. వైజాగ్ ఎయిర్‌పోర్టుగానే వ్యవహరించనున్నారు. ఎందుకంటే విశాఖపట్నం నుంచే ఎక్కువగా రాకపోకలు సాగనున్నాయి. అందుకే మహా నగరాన్ని భోగాపురంతో అనుసంధానించేందుకు ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కూడా జరగనుంది. మరో నాలుగు నెలల్లో దీనికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఆరులైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేను రెండు భాగాలుగా నిర్మించనున్నారు. హైవే రాకతో బీచ్‌రోడ్డుతో పాటు భీమిలి నుంచి భోగాపురం వరకు ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందనున్నాయి.

ఆసియా డేటా సెంటర్ రాజధానిగా విశాఖ

మధురవాడలోని ఐటీ హిల్-4లో డిజిటల్ విప్లవం మొదలుకానుంది. ఇది కేవలం విశాఖకే పరిమితం కాదు. యావత్ ఆసియా దేశాలకు పెద్దన్నగా మారనుంది. డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ సెంటర్లను 190 ఎకరాల్లో రూ.21,844 కోట్లతో అదానీ సంస్థ నిర్మిస్తోంది. ఏడేళ్లలోపు పూర్తికానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 20 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 20 వేల మందికి పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు రానున్నాయి. సాంకేతికత రాజ్యమేలుతున్న నేపథ్యంలో.. విశాఖ నగరం డిజిటల్ రంగంలో ఆసియాకు రాజధానిగా భాసిల్లనుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2030 నాటికి 1 గిగావాట్ డేటా సెంటర్‌గా ఇది దశలవారీగా అభివృద్ధి చెందనుంది. డేటా స్టోరేజ్ పెంచడంతో పాటు కృత్రిమ మేధ ఆవశ్యకత తెలిపేలా డిజిటలైజేషన్ విస్తరించడం, డేటా వేగం పెరగడం.. ఇలా విభిన్నమైన ప్రయోజనాలు అందించే ఈ ప్రాజెక్టు ద్వారా ఐటీ పరిశ్రమలు విశాఖకు క్యూ కట్టనున్నాయి. ఫలితంగా మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్ర యువతకు రానున్నాయి. సింగపూర్ నుంచి సబ్ మెరైన్ కేబుల్‌ను తీసుకొస్తూ.. డేటాసెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఇంటర్నెట్ డౌన్‌లోడ్ స్పీడ్ మరింత పెరగనుంది. దీని ద్వారా పరిశ్రమలకే కాకుండా.. ప్రజలకు కూడా ఈ ప్రాజెక్టు వరంలా మారనుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధిని ఓ ప్రాంతానికి మాత్రమే పరిమితం చేయడం తమ అభిమతం కాదనీ.. ఒక ప్రాజెక్ట్ ఏర్పాటైతే.. ఆ ప్రాంతంతో పాటు దాని పరిసరాలు కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్న కాన్సెప్ట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కంకణం కట్టుకున్నామని సీఎం జగన్ స్పష్టం చేశారు.

త్వరలోనే ప్రథమ శ్రేణి నగరంగా..

దక్షిణ భారత దేశంలోనే మోస్ట్ అడ్వాన్స్‌డ్ సిటీగా, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా.. ఫిన్‌టెక్ హబ్‌గా.. ఇలా విభిన్న రంగాల్లో దూసుకుపోతున్న విశాఖ.. ఇంకా ద్వితీయ శ్రేణి నగరంగానే ముద్రపడిపోయింది. అందుకే వైజాగ్‌ను ప్రథమ శ్రేణి నగరాల సరసన చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్ డేటా సెంటర్ శంకుస్థాపన సందర్భంగా ప్రకటించారు. అలాగే సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగానే పరిపాలన సాగిస్తామంటూ ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు.



అదానీ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం





సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, మాజీ మంత్రి ముత్తంశెట్టి

గోపాలపట్నం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అదానీ డేటా సెంటర్‌తో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం ఉదయం 9.37 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అరకు ఎంపీ జి.మాధవి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ తదితరులు సీఎంకు పుష్పగుచ్ఛం అందించి.. స్వాగతం పలికారు. 9.56 గంటలకు హెలికాప్టర్‌లో ఆయన భోగాపురం పయనమయ్యారు. ఆయన వెంట మంత్రి అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలు వెళ్లారు. విజయనగరం, విశాఖ జిల్లాల్లో సీఎం జగన్ కార్యక్రమాలు ముగించుకుని.. వర్షం కారణంగా రోడ్డు మార్గంలో బయలుదేరి 4.28 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. 4.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజిని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం తదితరులు వెళ్లారు.

పర్యటన సాగిందిలా..

విశాఖ విమానాశ్రయానికి బుధవారం ఉదయం 9.37 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సీఎం జగన్ అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా భోగాపురం బయలుదేరారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ హిల్-3కి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హిల్-4కి చేరుకుని అదానీ డేటాసెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

తర్వాత రుషికొండలోని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాసానికి చేరుకున్నారు. ఎంపీ కుమారుడు శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులను ఆశీర్వదించారు. అనంతరం హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాల్సి ఉండగా.. వాతావరణం అనుకూలించకపోవడంతో రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు బూడి ముత్యాలనాయుడు, విడదల రజని, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, డా.బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, కన్నబాబు, గొల్ల బాబూరావు, కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎంఎస్ఎంఈ చైర్మన్ ఆడారి ఆనంద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

జోరువానలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ఫ్యామిలీ డాక్టర్, ఉపాధి పనుల పరిశీలన

గొలుగొండ: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఒకపక్క జోరువాన కురుస్తుండగా కలెక్టర్ పర్యటన విస్తృతంగా సాగింది. ముందుగా నాగాపురం గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. రోజూ ఎంత కూలీ వస్తుంది.. ఏ సమయంలో పనులకు వస్తున్నారు.. అని ఆరా తీశారు. ఎంత కూలీ గిట్టుబాటవుతుందో తెలుసుకున్నారు. కూలీలతో మాట్లాడుతున్న సమయంలో భారీ వర్షం కురిసింది. అరగంటపాటు అక్కడే గడిపారు. ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతూ కూలీలకు సక్రమంగా పనిదినాలు కల్పించి, పేమెంట్లు జరపాలని చెప్పారు. అనంతరం కొంకసింగి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎంత మంది ఉన్నారు, ఎంతమంది ఈ సేవలను వినియోగించుకుంటున్నారో అడిగారు. అక్కడే సబ్ సెంటర్ ఉండటం వలన పేదలకు నూరుశాతం వైద్య సేవలు అందాలని ఆదేశించారు. ఏఎల్‌పురం గ్రామంలో ఉన్న జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ పాఠశాలకు వెళ్లి నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు నాణ్యంగా లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసి విద్యార్థులకు మంచి సౌకర్యాలు అందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గొలుగొండ పీహెచ్‌సీ తనిఖీ చేసి, అక్కడ అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం జోగుంపేట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ఇళ్ల వద్ద ఉన్న తడి పొడి చెత్తను సేకరించి ఎరువులు తయారు చేయాలని తెలిపారు. జిల్లా వైద్యాధికారి హేమంత్, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, పీఆర్ డీఈఈ ప్రసాద్, తహసీల్దార్ అనందరావు, ఎంపీడీవో డేవిడ్‌రాజు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి పాల్గొన్నారు.



నాగాపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కొంకసింగిలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- సైబర్ నేరగాళ్ల బాధితుల్లో యువతే ఎక్కువ
- 1930 టోల్‌ఫ్రీని సంప్రదించండి– ఎస్పీ మురళీకృష్ణ



సాక్షి, అనకాపల్లి: సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయిన వారిలో ఎక్కువగా యువతే ఉన్నట్లు పేర్కొన్నారు. రోజు రోజుకూ కొత్తకొత్త నేరాలతో సైబర్ కేటుగాళ్లు ఆర్థికంగా, మానసికంగా బాధితుల్ని వేదనకు గురిచేస్తున్నారని, దీనిపై ప్రజలు మరింత జాగ్రత్త వహించాలన్నారు. బ్యాంక్ అకౌంట్, ఏటీఎం పిన్, ఆధార్, పాన్ వివరాలను అపరచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఆర్థిక మోసానికి గురైతే తక్షణమే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి, ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉద్యోగావకాశాలను సెర్చ్ చేసేటపుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగం ఇస్తామని కాల్ చేసి జాయినింగ్ ఫీజ్ కట్టాలని అడిగితే అది కచ్చితంగా మోసమేనని గుర్తించాలన్నారు. కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్లో వెతికే సమయంలో, మరోసారి ఆ నంబర్‌ను నిర్ధారించుకోవాలని సూచించారు. డేటింగ్ యాప్స్, సోషల్ మీడియాలో యువతుల అకౌంట్లతో మెసేజ్‌లు పంపేవారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

రూ.1483 కోట్ల రుణ ప్రణాళిక సిద్ధం

- డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం
- సమీకృత సాగుతో అనేక ప్రయోజనాలు
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతి

-8లో

పశువుల కొనుగోలుకు వడ్డీలేని రుణాలు

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనందకుమార్

నాతవరం: పశువుల కొనుగోలుకు ఈ ఏడాది పాడి రైతులకు రూ.20 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ చెప్పారు. జిల్లేడుపూడిలో బుధవారం సర్పంచ్ లాలం రమణ అధ్యక్షతన జరిగిన పాడి రైతుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. బుచ్చింపేట నూకాలమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో రూ.4 లక్షలతో మరుగుదొడ్లు, మహిళలు స్నానాలు చేసేందుకు షెడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. జిల్లేడుపూడిలో అసంపూర్తిగా ఉన్న పాలకేంద్రం భవనానికి రూ.లక్షా 50వేలు నిధులు మంజూరు చేశారు. అధిక పాలు ఇచ్చే సంకర జాతి పశువుల ప్రదర్శనను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అధిక పాలు సరఫరా చేసే రైతులకు పాల యంత్రాలు రాయితీపై ఇస్తున్నామన్నారు. ఇంతవరకు డెయిరీ ద్వారా 50 మంది రైతులకు యంత్రాలు సరఫరా చేశామని, యంత్రం ఒక్కంటికి రూ.38 వేలు ఖర్చవుతుందని అన్నారు. అలాగే పశుదాణా, మందులు, పశుగ్రాసం కట్టర్లు రాయితీపై ఇస్తున్నామని, ఉచితంగా బోర్లు వేస్తున్నామని, పశువులకు నూటికి 90 శాతం ఆడ పెయ్యిలు జన్మించే ఇంజక్షన్లు కూడా రాయితీపై ఇస్తున్నామని తెలిపారు. విశాఖ డెయిరీలో ప్రస్తుతం రోజుకు 8.23 లక్షల లీటర్లుగా ఉన్న పాల సేకరణను, 10 లక్షల లీటర్లకు పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం అధిక పాలు సరఫరా చేసే పాడి రైతులను సత్కరించి ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్లు శ్రీరంరెడ్డి సూర్యనారాయణ, చిటికెల రాజకుమారి, గేదెల సత్యనారాయణ, జనరల్ మేనేజర్ వీర పాండ్యరాజ్, నర్సీపట్నం ఏరియా మేనేజరు సిహెచ్.సత్యనారాయణ, గోపాలమిత్రలు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, సర్పంచ్ లాలం రమణ మాజీ సర్పంచ్ లాలం లోవ, పాలకేంద్రం అధ్యక్షుడు రొంగలి కన్నబాబు పాల్గొన్నారు.



పాడి రైతుకు ప్రోత్సాహకాలు అందిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్

కుమ్మరించిన వాన!

- పలుచోట్ల భారీ వర్షం
- నేడూ కురిసే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: వాన కుమ్మరించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరలు తెరలుగా కురుస్తూనే ఉంది. జనజీవనానికి అంతరాయం కలిగించింది. ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో వర్ష తీవ్రత అధికంగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో అనకాపల్లి జిల్లా పరవాడలో 6.1 సెం.మీలు, విశాఖ జిల్లా గోపాలపట్నంలో 5.6, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 4.8 చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది. గురువారం కూడా ఉమ్మడి విశాఖలో వానలు కొనసాగనున్నాయి.

వర్షపాతం ఎక్కడ? ఎంత? (సెం.మీలలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
అనకాపల్లి	పరవాడ	6.1
అనకాపల్లి	అనకాపల్లి	5.0
అనకాపల్లి	కోటవురట్ల	4.3
అనకాపల్లి	యలమంచిలి	3.6
విశాఖపట్నం	గోపాలపట్నం	5.6
విశాఖపట్నం	విశాఖ రూరల్	5.6
విశాఖపట్నం	గాజువాక	4.0



విశాఖలో దంచికొట్టిన వర్షం

అనకాపల్లిలో లోతట్టు ప్రాంతాలు జలమయం

అనకాపల్లి టౌన్: పట్టణంలో బుధవారం కురిసిన కుంభవృష్టితో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ్యాయి. అనకాపల్లి–చోడవరం రహదారిలో రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షం నీరు నిలిచిపోవడంతో భారీ వాహనాలను ట్రాఫిక్ పోలీసులు లక్ష్మీదేవిపేట రైల్వే క్రాసింగ్ మీదుగా మళ్లించారు. నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, షిర్డీసాయి బాబా మందిరం వెనుక వీధిలో రహదారులు చెరువులను తలపించాయి. సత్యనారాయణపురం గ్రామంలో దొంగగెడ్డ పొంగి ప్రవహించడంతో అటుగా వెళ్లే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అనకాపల్లి మండలంలో దొంగగెడ్డ ఉధృతికి మధ్యలో నిలిచిపోయిన కారు

క్లుప్తంగా

సీఎం జగన్‌కు వినతి

మహారాణిపేట: విశాఖ పర్యటనకు బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర నగరంలో కలిసి వినతిపత్రం అందించారు. పంచాయతీ రాజ్‌లో డీఎల్‌డీవో పోస్టుల వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించి, సంబంధిత ఉత్తర్వులను పునఃపరిశీలించాలని కోరారు.

బ్రాండిక్స్ బస్సుకు ప్రమాదం


ప్రమాదానికి గురైన వాహనం

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని బ్రాండిక్స్ మహిళా కార్మికులు వెళ్తున్న బస్సు మంగళవారం రాత్రి కుమారపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కార్మికులు గాయపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ బ్రాండిక్స్ బస్సుల్లో వేగ నియంత్రణ చేపట్టాలని, బస్సుల్లో ప్రయాణిస్తున్న కార్మికులకు రక్షణ కల్పించాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన కార్మి కులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు.

ట్రేడ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తుమ్మపాల: జిల్లాలో హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలు తప్పనిసరిగా ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి కె.అశోక్ బుధవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లకు రూ.300, హోంస్టేలు, ఫాం స్టేలకు రూ.200, టూర్ బోట్ ఆపరేటర్స్, ఎడ్వంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్స్, వెల్‌నెస్ సెంటర్లు, కన్వెన్షన్ హాళ్లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు రూ.500 చెల్లిస్తూ www.aptourism.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రూ.1483 కోట్ల రుణ ప్రణాళిక సిద్ధం

- డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం
- సమీకృత సాగుతో అనేక ప్రయోజనాలు
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతి

నాతవరం: జిల్లాలో ఈ ఏడాది వెలుగు ద్వారా వివిధ కేటగిరీల్లో రూ.1483 కోట్లు రుణాలిచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతి తెలిపారు. వెలుగు కార్యాలయంలో బుధవారం సమీకృత వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1037.46 కోట్లు, ఉన్నతి పథకం ద్వారా రూ.7 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ.147 కోట్లు మేర రుణాలిచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. వీటితో పాటు డ్వాక్రా సంఘాలకు సమీకృత పథకం సీఐఎఫ్ కింద రూ.291.83 కోట్లు రుణాలివ్వనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో 31,879 డ్వాక్రా సంఘాలలో సుమారు 3 లక్షల 50 వేలకు పైగా మహిళలు ఉన్నారని, వారందరికీ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హతలున్న గ్రూపులకు బ్యాంక్ లింకేజీ రుణాలందిస్తామన్నారు. రుణాలతోపాటు మహిళల్ని వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించనున్నట్టు పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు అనేక రకాల చిరు వ్యాపారాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు.

కాలానుగుణంగా వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని మహిళలతో పాటు, రైతులు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. అందులో భాగంగానే రైతులు వారి పంట పొలాల్లో, ఇంటి సమీపంలో ఐదు రకాల పంటలు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాటితో పాటు కోళ్ల పెంపకం, డెయిరీల ఏర్పాటు, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా రైతుల జీవనోపాధి మరింత మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వం గొర్రెలు, మేకలు జీడి మామిడి ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రుణ సౌకర్యం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఎఫ్‌పీవో డీపీఎం సంజయ్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎం మర్రి లక్ష్మి, డ్వాక్రా సంఘాల మహిళలు, వెలుగు సీపీలు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌లో పొదుపు సంఘాల సమాచారం

వీవోఏ, సీసీల శిక్షణలో డీఆర్‌డీఏ జిల్లా ఐబీ ఏపీఎం చంద్రకళ


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ జిల్లా ఐబీ ఏపీఎం చంద్రకళ

దేవరాపల్లి: పొదుపు సంఘాలు, సభ్యుల సమాచారం, జీవనోపాధుల స్థితిగతులు, ఆర్థిక పరమైన లావాదేవీలను దేశవ్యాప్తంగా ఇకపై లోకోస్ యాప్‌లోనే నమోదు చేయాలని డీఆర్‌డీఏ ఐబీ ఏపీఎం బి.చంద్రకళ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) కార్యాలయంలో బుధవారం మండల స్థాయిలో వీవోఏలు, సీసీలకు శిక్షణ ఇచ్చారు. నాలుగు రోజుల శిక్షణలో భాగంగా తొలి రోజు జిల్లా ఐబీ(ఇన్వెస్ట్‌మెంట్ బిల్డింగ్) ఏపీఎం చంద్రకళతో పాటు స్థానిక ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి పలు సూచనలు చేశారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్(ఎన్ఆర్ఎల్ఎం)లో భాగంగా ఇకపై పొదుపు సంఘాల వివరాలన్నీ లోకోస్ యాప్‌లోనే నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ బుక్ కీపింగ్ విధానం ద్వారా సంఘాలు, సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్ఆర్ఎల్ఎం ప్రాజెక్టులో భాగంగా ఇకపై దేశమంతటా లోకోస్ యాప్ ద్వారానే వివరాలను పక్కాగా నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని వీవోఏలు, సీసీలను సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఏపీఎం ఎస్.ప్రభాకర్, డీఆర్‌డీఏ క్లస్టర్ లీగల్ కోఆర్డినేటర్(ఎల్‌సీ) డి.ఉమాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి


కానిస్టేబుల్ ఆవుపాటి శివసత్యనారాయణ(40)

కశింకోట: కశింకోట రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని బయ్యవరానికి చెందిన ఆవుపాటి శివసత్యనారాయణ(40) విశాఖ ఎంవీపీ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 1న బయ్యవరంలోని తన ఇంటి నుంచి స్కూటీపై వస్తూ కశింకోట వద్ద లారీని తప్పించబోయి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ తెలిపారు. ఈ మేరకు భార్య రామసూర్య లీలాలలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.


విశాఖ పర్యటనకు వచ్చిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సింహగిరిపై చందనం విక్రయాలు ప్రారంభం


చందనం ప్యాకెట్లు విక్రయిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

సింహాచలం: సింహగిరిపై చందనం విక్రయాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గత నెల 23న చందనోత్సవాన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిపై ఉన్న చందనాన్ని ఒలిచి, భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. ఆ చందనాన్ని భక్తులకు ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి ప్రసాద విక్రయశాల వద్ద ఉన్న క్యూల్లో భక్తులకు ప్యాకెట్లు విక్రయించారు. ఆలయ సూపరింటెండెంట్ అప్పలనాయుడు భక్తులకు ప్యాకెట్లు అందించారు. రోజుకు 1000 ప్యాకెట్లు చొప్పున ఒక ప్యాకెట్ రూ.10కి విక్రయాలు జరపనున్నారు.

రేపు అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు బుధవారం తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 2.30గంటలకు సుప్రభాత సేవ అనంతరం స్వామికి రెండో విడత చందనం సమర్పణ, ఆరాధన, బాలభోగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. అనంతరం స్వామికి ఆస్థానమండపంలో పంచకలశ స్నపనం జరిపిస్తామని తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- కాశీపురంలో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ
- 108లో కేజీహెచ్‌కు తరలింపు– పరిస్థితి విషమం


కాశీపురం వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భాస్కరరావు

దేవరాపల్లి: కాశీపురం నూకాలమ్మ ఆలయ సమీపంలో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తిని విజయనగరం జిల్లా రణస్థలం సమీపంలోని చిన్నబత్తివలసకు చెందిన లండ భాస్కరరావు(28)గా అతని వద్ద లభించిన ఆధారాల మేరకు గుర్తించారు. బాధిత యువకుడికి కుడి కాలు, కుడి చేయి నుజ్జునుజ్జయ్యాయి. దీంతో సంఘటనా స్థలంలోనే యువకుడు అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది క్షతగాత్రుడిని విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల కోసం దేవరాపల్లి పోలీస్‌లను ఆశ్రయించగా ఇంకా కేసు నమోదు చేయలేదని, పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామన్నారు.

పొరుగు జిల్లాకు వెళ్లి.. పింఛన్ అందించి

జోరు వానలోనూ వలంటీర్లు పింఛన్ల పంపిణీలో తమ నిబద్ధతను చాటుకున్నారు. వాతావరణం అనుకూలించకపోయినా.. అనారోగ్య సమస్యలతో ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతోన్న లబ్ధిదారుల్ని కూడా విడిచి పెట్టలేదు. తమ సొంత ఖర్చులతో పొరుగు జిల్లాకు వెళ్లి మరీ తమ చిత్తశుద్ధిని మరోసారి నిరూపించుకున్నారు.


కేజీహెచ్‌లో సత్తిబాబుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నూకినాయుడు


బెహరా ఆస్పత్రిలో దేముడమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సన్యాసినాయుడు

రావికమతం: మేడివాడ గ్రామ వాలంటీర్ బండి నూకినాయుడు కేజీహెచ్‌కు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న బండారు సత్తిబాబుకు బుధవారం పింఛన్ అందించాడు. తన పరిధిలో ఉన్న పింఛన్ లబ్ధిదారులందరికీ 1వ తేదీ ఉదయాన్నే పింఛన్ ఇచ్చేసిన నూకినాయుడు, గ్రామానికి చెందిన సత్తిబాబు అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకున్నాడు. దీంతో అతనికి పింఛన్ అందించేందుకు విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదు అందించాడు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ నిబద్ధతను సత్తిబాబు కుటుంబ సభ్యులు అభినందించారు.

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన వలంటీర్ జి.సన్యాసినాయుడు సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి ప్రైవేట్‌ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేముడమ్మకు పింఛన్ నగదును బుధవారం అందించాడు. గత వారం రోజులుగా దేముడమ్మ అనారోగ్యంతో విశాఖలోని బెహరా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రిలో దేముడమ్మ బయోమెట్రిక్‌ను తీసుకుని పింఛన్ నగదును అందించి తన నిబద్ధతను చాటుకున్నాడు. వలంటీర్ సన్యాసినాయుడు వలపై గ్రామ సర్పంచ్ పైల పైడితల్లమ్మ, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, సీనియర్ నాయకుడు యడ్ల వెంకటరావులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి


భరద్వాజ్ మృతదేహం


భరద్వాజ్ (ఫైల్)

ఆనందపురం : మండలంలోని వేములవలస వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమునిపట్నం మండలం, చిప్పాడ గ్రామానికి చెందిన సరగడ భరద్వాజ్ (25) గత ఆరేళ్లుగా జమ్ముకాశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల రాజస్థాన్ బదిలీకాగా ఈ నెల 1న సెలవుపై ఇంటికి వచ్చాడు. అతనికి వివాహం కాలేదు. మంగళవారం తన అన్న శివ, స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి గ్రామ సమీపంలో గల లే అవుట్‌లో కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఆ కారు మరమ్మతులకు గురికాగా అన్నయ్య శివను ఇంటికి పంపించేసి, కారుకు మరమ్మతులు చేయించడానికి స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి తగరపువలస వెళ్లాడు. తీరా రాత్రి 10 గంటలైనా భరద్వాజ్ ఇంటికి రాకపోవడంతో అన్నయ్య శివ ఫోన్ చేయగా కారు మరమ్మతులు పూర్తయిన వెంటనే వచ్చేస్తానని చెప్పాడు. ఇందిలా ఉండగా వేములవలస జాతీయ రహదారిపై కారుని మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో భరద్వాజ్ తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు పోలీసులు భరద్వాజ్ అన్నయ్య శివకు సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు వెళ్లగా అప్పటికే భరద్వాజ్ మృతి చెందాడు. పెందుర్తి వైపు నుంచి వెళ్తున్న కారు ఎదురుగా రాంగ్ రూట్లో మోటార్ బైక్‌పై వస్తున్న భరద్వాజ్‌ని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించినట్టు చెబుతున్నారు. కాగా తగరపువలసలో కారు మరమ్మతులు చేయిస్తున్న భరద్వాజ్ తన స్వగ్రామం చేరుకోవడానికి విజయనగరం రోడ్డు వైపు ప్రయాణించాల్సి ఉండగా రాత్రి వేళ రాంగ్ రూట్లో ఆనందపురం వైపు రావాల్సిన అవసరం ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అలాగే భరద్వాజ్ ఏదో పనిపై మధురవాడ వెళ్లి వచ్చినట్టు మరో కథనం వినిపిస్తోంది. మృతునికి తండ్రి వెంకట రమణ, తల్లి అరుణ, సోదరుడు శివతోపాటు సోదరి ఉంది. వీరిది వ్యవసాయ కుటుంబం. ఎస్ఐ నరసింహమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో చిప్పాడలో విషాదం నెలకొంది. కారు రూపంలో మృత్యువు తమ కుమారుడిని పొట్టన పెట్టుకుందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గ్యాస్ట్రిక్ అల్సర్లకు కొత్త మందు

- ఏయూ ప్రయోగశాలలో ఆవిష్కరణ
- రూపకర్తలకు వీసీ ప్రసాదరెడ్డి అభినందన


రవికిరణ్, మధుమితలను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: గ్యాస్ట్రిక్ అల్సర్లకు ఏయూ విద్యార్థులు కొత్త మందును కనిపెట్టారు. వర్సిటీ జువాలజీ విభాగంలో నెలకొల్పిన ది సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ అప్లైడ్ బయలాజికల్ సైన్సెస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(టీ కాబ్స్‌ఈ) ప్రయోగశాలలో ఈ నూతన ఆవిష్కరణ జరిపారు. హీలికోబాక్టర్ పైలోరి అనే బాక్టీరియా ఫలితంగా మనుషుల్లో గ్యాస్ట్రిక్ అల్సర్లు, కొన్ని సందర్భాలలో క్యాన్సర్లు సైతం వస్తాయి. ఇప్పటి వరకు ప్రపంచంలో ఈ బాక్టీరియాను నివారించే మందులు లేవు. ప్రపంచంలో 85 నుంచి 95 శాతం వరకు మనుషుల్లో ఈ బాక్టీరియా ఫలితంగా గ్యాస్ట్రైటిస్, గ్యాస్ట్రిక్ అల్సర్లు కనిపిస్తాయి. టీ కాబ్స్ ఈ ప్రయోగశాలలో కంప్యూటర్ ఉపయోగించి ఎంఏ01027 ప్రయోగాత్మక మందును తయారు చేశారు. ఈ ఔషధం బాక్టీరియాను నిరోధించినట్లు డాక్టర్ యేడిది రవికిరణ్, అగ్గున్న మధుమితలు జరిపిన పరిశోధనలో తేలింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో డాక్టర్ రవికిరణ్, మధుమితలను అభినందించారు. ఈ పరిశోధనకు ఏయూ ఐపీఆర్ సెంటర్ నుంచి పేటెంట్‌ను సైతం ఫైల్ చేశారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ): జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.సుధ(టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. డిక్సన్ మ్యానుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ తిరుపతి, ల్యాండ్ మార్క్ గ్రూప్, అరోవానా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఎక్స్‌ప్రెస్ బీస్, రాక్‌మన్ ఇండస్ట్రీస్, ఖజానా జ్యూయలరీస్, కాన్‌సెంట్రిక్స్, ఎక్స్ టెక్ టెస్టింగ్ లిమిటెడ్, ఐనాక్స్, వైఎస్‌కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు 435 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఆపరేటర్, కస్టమర్ రిప్రజెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీకాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఏఎస్ఎం, డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్‌షిప్ అధికారులు, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, ట్రైనీలు, మేనేజర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీకామ్(టాలీ), బీటెక్ ఎంబీఏల్లో ఆయా ఉద్యోగాలను బట్టి అర్హులై ఉండాలని తెలిపారు. 18–35 సంవత్సరాల మధ్య వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పోస్టును బట్టి వేతనం నెలకు రూ.10–15 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా సాక్షి మాక్‌టెస్ట్

ఆనందపురం: సాక్షి ఆధ్వర్యంలో మండలంలోని శొంఠ్యాంలోని ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మాక్ ఆన్‌లైన్ టెస్ట్ రెండో రోజైన బుధవారం కొనసాగింది. నీట్, ఎంసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థుల ప్రయోజనార్థం మాక్‌టెస్ట్ నిర్వహిస్తున్నారు. రెండో రోజు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. టెక్నాలజీ పార్టనర్‌గా మైర్యాంక్ సంస్థ వ్యవహరిస్తోంది.

నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు పరిశీలించిన డీఆర్ఎం

అగనంపూడి (గాజువాక): దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద వారం రోజులుగా కొనసాగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనులను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో భద్రతకు సంబంధించిన ఆధునికీకరణ పనులను గత నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. గతంలో ఉన్న ప్యానల్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్‌ను ఆధునికీకరిస్తూ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ పద్ధతికి మార్చుతున్నారు. ఆ పనులను డీఆర్ఎం బుధవారం జోరువానలోనూ పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. ఆయన వెంట సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో–ఆర్డినేషన్) పి.కె.మహారాణా, సీనియర్ డివిజనల్ సిగ్నల్, టెలికాం ఇంజినీర్ దీప్తాంశు శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంకు సాదర స్వాగతం



విశాఖ పర్యటనకు వచ్చిన సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి బుధవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు స్వాగతం పలికారు.

నేడు తేగాడలో 'గడప గడపకు'

కశింకోట : మండలంలోని తేగాడ సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేస్తారన్నారు.

త్రిపురాంతకస్వామి కల్యాణం రేపు

కశింకోట : స్థానిక శివాలయంలో ఈ నెల 5న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు వెలవలపల్లి వెంకట సూర్య శంకరం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు స్వామి, దేవేరిలల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరపనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10న రాత్రి 7 గంటలకు స్వామి వారి పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు వయోవృద్ధుల సమావేశం

అనకాపల్లిటౌన్ : ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈనెల 5న స్థానిక గవరపాలెం వి.వి.రమణరైతు భారతిహాల్లో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల కృష్ణఅప్పారావు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లాలో వృద్ధులంతా హాజరుకావాలని ఆయన బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 507 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	4,100	4,680
రెండో రకం	3,770	4,130
మూడో రకం	3,290	3,750

అనకాపల్లి సినిమాలు

సిసు	రాజా
ఏజెంట్	సత్యనారాయణ స్క్రీన్-1
కలియుగ భగవాన్ (ఉదయం ఆట)	
రారా పెనిమిటి (3ఆటలు)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-28 యూనిట్లు , ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 329 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 224 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సామాజిక బాధ్యతగా స్కూళ్లకు సహకారం



వెదురుపర్తి హైస్కూలులో ఐదు గదులతో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్మించిన భవన సముదాయం



కశింకోటలో సమగ్ర బాలికల వసతి గృహానికి లారస్ పరిశ్రమ సహకారంతో నిర్వహిస్తున్న మరమ్మతు పనులు

- పరిశ్రమల నిర్వాహకుల వితరణ
- వివిధ అభివృద్ధి పనులకు చేయూత

కశింకోట : మండలంలో వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం పట్ల పలు పరిశ్రమల నిర్వాహకులు దృష్టి సారించారు. సామూహికంగా ఎక్కువ మందికి ఉపయోగపడే వాటిని చేపడుతున్నారు. ఇప్పటికే స్కూలు భవవ సముదాయాన్ని నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. సాగునీటి చెరువు తవ్వించి ఆయకట్టుకు నీరు అందించారు. ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిర్వహించడంలో నిమగ్నయ్యారు. మండలంలోని వెదురుపర్తి హైస్కూలులో తగిన గదులు లేక వసతి సమస్యతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సుమారు రూ.70 లక్షలతో మండలంలోని నరసాపురం వద్ద ఉన్న రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఐదు గదుల భవన సముదాయం నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు చాలీ చాలని గదులలో చదువుకోవలసిన పరిస్థితిని ఎంపీ వెంకట సత్యవతి దృష్టికి స్థానికులు గత ఏడాది తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆమె మంత్రి అమర్‌నాథ్ ప్రోత్సాహంతో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నిర్వాహకులతో చర్చించారు. వారు ముందుకు వచ్చి భవన నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఐదు తరగతి గదులను దీనిలో నిర్మించారు. ఈ భవనం నిర్మాణం వల్ల హైస్కూల్లో ఇప్పటి వరకు నడుస్తున్న ఆరు గదులకు అదనంగా మరో ఐదు గదులు సమకూరనున్నాయి. ప్రస్తుతం 1 నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు 168 మంది విద్యార్థులున్నారు. వీరికి 8 గదులు, హెచ్‌ఎం, ల్యాబ్, స్టాఫ్‌కు ఒక్కో గది సమకూరనుండడంతో పూర్తిగా వసతి సమస్య తీరనుంది. దీంతో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి, ఎంపీలు, సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. బయ్యవరంలో పెద్ద చెరువును అచ్యుతాపురం ఎస్ఈజెడ్ వద్ద ఉన్న ఏసియన్ పేయింట్స్, అంబుజా సిమెంట్ పరిశ్రమ నిర్వాహకులు ముందుకు వచ్చి గత ఏడాది సుమారు రూ.20 లక్షలతో పూడిక తీయించి రక్షణ గట్లు పటిష్టం చేసి సాగునీటి కాలువలకు తలుపులు అమర్చారు. దీంతో ఆయకట్టున ఉన్న సుమారు 500 ఎకరాల పంట భూములకు సాగునీరు అందుతుంది. పంటలు బాగా పండుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పరవాడ వద్ద అరబిందో పరిశ్రమ ఆధ్వర్యంలో మంత్రి అమర్‌నాథ్ ప్రోత్సాహంతో కశింకోటలో కల్యాణ మండపం, తాళ్లపాలెంలో ఉన్న అసంపూర్తి కల్యాణ మండపం నిర్మాణం పూర్తికి యాజమాన్యం ముందుకు వచ్చింది. కశింకోటలో ఇటీవల భూమి పూజ కూడా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సిఫారసు మేరకు లారస్ పరిశ్రమ ఆధ్వర్యంలో కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహాన్ని సుమారు రూ.35 లక్షల అంచనా వ్యయంతో అన్ని హంగులతో మరమ్మతులు చేపట్టి శరవేగంగా పూర్తి చేస్తున్నారు. పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. ఇలా ప్రైవేటు పరిశ్రమలు సామాజిక సేవకు దోహదపడుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా భవనం

వెదురుపర్తి హైస్కూలుకు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ సహకారంతో 5 గదుల భవన సముదాయాన్ని నిర్మించారు. భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ భవనం నిర్మాణంతో సరిపడిన గదులు సమకూరి స్కూల్లో వసతి సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది.

–జీవీకె ఆచారి, హెచ్‌ఎం, వెదురుపర్తి

ముంచెత్తిన వాన



పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో చేరిన వర్షపు నీరు



పంట భూమిలో చేరిన నీరు

కశింకోట : కశింకోట ప్రాంతంలో బుధవారం వర్షం దంచికొట్టింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు, మండల పరిషత్ కార్యాలయ ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడ్డారు. మడుల్లో కూడా నీరు చేరింది. అకాల వర్షాలు మామిడి, నువ్వు పంటను దెబ్బతీస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

ఆలయ ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం



గౌరీపరమేశ్వరుల నూతన ఉత్సవ కమిటీని సత్కరిస్తున్న జానీ, రమేష్‌లు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి శ్రీగౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ(2023–2025) ప్రమాణస్వీకరణ బుధవారం ఆలయ ఆవరణలో జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, కార్యదర్శి మద్దాల నూకరాజు(ఎల్ఐసీ), సహాయ కార్యదర్శి పనసా శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్‌లు గౌరీపరమేశ్వరుల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధ్యక్షుడు వాకాడ బాబు మాట్లాడుతూ వేల్పులవీధి పెద్దలు, స్థానిక ప్రజలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంలో అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో ఆలయ మొదటి వార్షికోత్సవాలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ పట్టణ యువజ విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌లు కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు నల్లల దేముళ్లు, మద్దాల కూర్మారావు, ఉగ్గిన అప్పారావు, గరికి వెంకటరావు, ముత్తా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై డీఎస్పీకి వినతి



నూతన డీఎస్పీ సుబ్బరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లిటౌన్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజును డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ చిన్నియాదవ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షనకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, మెయిన్‌రోడ్డులో రహదారికి ఇరువైపులా సాయంత్రం సమయంలో వాహనదారుల, పాదచారులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, సోమరాజు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

అనకాపల్లి టౌన్ : మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధిలో గురువారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారని ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం పేర్కొన్నారు. సచివాలయం-1, సచివాలయం-2లను, రైతు భరోసా కేంద్రం, షాదీఖానా, పిసినికాడ పంచాయతీలో సచివాలయం, డ్రైనేజీ, రహదారులను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సత్యనారాయణపురం పంచాయతీలో కొత్తూరు– బంగారుమెట్ట (ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ నుంచి ఏలేరు కాలువ మీదుగా మూలపేట గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

బాలల్లో బైబిల్ పఠనాసక్తి అభినందనీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: విద్యార్థి స్థాయి నుంచే బైబిల్ పఠనాసక్తిని పెంపొందించుకోవడం అభినందించదగ్గ విషయమని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో బుధవారం బైబిల్‌పై బాలబాలికలకు జరిగిన మూడు రోజుల వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో పలు చర్చిలకు చెందిన 300 మంది క్రైస్తవ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషించదగ్గ విషయమన్నారు. అంతకుముందు శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో శిక్షకులు రామారావు, చర్చి అధ్యక్షుడు ఎ.జె.మోహన్‌దాస్, కార్యదర్శి కె.జోసెఫ్, కోశాధికారి జి.శేషుకుమార్, వైఎస్సార్ పట్టణ కార్యదర్శి గైపూరి రాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

- నక్కపల్లి కాలనీలో స్ట్రీట్‌లైట్లు ప్రారంభం
- లబ్ధిదారులకు ఉచితంగా మీటర్లు



కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు



స్ట్రీట్‌లైట్లను ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ అచ్చిరాజు

నక్కపల్లి : జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ప్రతి పేద వాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉచితంగా ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. నక్కపల్లి మండలంలో 29 లేఅవుట్లు ఏర్పాటు చేసి 3 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వీరందరికీ పక్కా గృహాలు మంజూరు చేశారు. లేఅవుట్లలో కనీస సదుపాయాలను ఏర్పాటు చేశారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయంతో పాటు, విద్యుత్ సదుపాయం కూడా కల్పించారు. దీంతో లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చకచకా ప్రారంభించారు. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మీటరు, బోర్డు, స్తంభం నుంచి ఇంటికి అవసరమైన విద్యుత్ వైరు కూడా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. వీధి లైట్లు కూడా ఏర్పాటు చేశారు. బుధవారం మండల కేంద్రం నక్కపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాను, స్ట్రీట్‌లైట్లను స్థానిక ఉప సర్పంచ్ వీసం అచ్చిరాజు ప్రారంభించారు. ఈ కాలనీలో 140 మందికి పట్టాలు పంపిణీ చేశారు. వీరంతా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. 30 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కాలనీలో అన్ని వీధులకు ప్రత్యేకంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు వేశారు. స్ట్రీట్ లైట్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ స్ట్రీట్‌లైట్లను బుధవారం వెలిగించారు. మండలంలో మొత్తం 29 లేఅవుట్లలో 22 లేఅవుట్లలో విద్యుత్ సదుపాయం పూర్తి స్థాయిల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలిన లేఅవుట్లలో పనులు జరుగుతున్నాయని ఏఈ కృష్ణ తెలిపారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సదుపాయం కల్పించి స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం పట్ల కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సైట్ ఇంజినీరు రామకృష్ణ, మండల లైన్‌మేన్ నాగేంద్ర, స్థానిక లైన్‌మేన్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొడుగుల బంగార్రాజు, లబ్ధిదారుడు బొంతురాజు, హెల్పర్ వెంకట్ పాల్గొన్నారు.

పెద్దేరులో పెరుగుతున్న నీటిమట్టం



పెద్దేరు జలాశయంలో పెరిగిన నీటి నిల్వలు

మాడుగుల రూరల్ : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయంలో నీటి మట్టం పెరిగింది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం నాటికి 131.40 మీటర్లకు చేరింది. జలాశయం పరిసరాలల్లో 36 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు 17 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోందన్నారు.

'ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి పేరు పెట్టాలి'

నర్సీపట్నం : భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయమని నర్సీపట్నం క్షత్రియ పరిషత్ అధ్యక్షులు మంతెన శ్రీరామరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టి, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

బంగారమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు

ఎస్.రాయవరం : మత్స్యకారుల ఆరాధ్య దైవం అయిన శ్రీ బంగారమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో విద్యుదలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. జాతర పురస్కరించుకుని ఉత్సాహంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు.

సిమెంటు రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు

కశింకోట : స్థానిక గవరపేట మధ్యవీధి నుంచి దుర్గాలమ్మ ఆలయం వరకు త్వరలో సిమెంటు రోడ్డు, డ్రైనేజి నిర్మించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఇక్కడి వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకు వెళ్లి ఆయన సహకారంతో వీటిని నిర్మించనున్నట్లు చెప్పారు. అలాగే మంచినీటి సమస్య నివారణకు పైప్‌లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పి.ఎస్.ఆర్ పేటలో దుర్గాదేవి విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామ ప్రజలు

యలమంచిలి : మండలంలో పి.ఎస్.ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రెండు గ్రామాల ప్రజల ఆర్థిక సహాయంతో నూతనంగా దుర్గాదేవి ఆలయాల నిర్మాణం పూర్తి చేసుకుని ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అమ్మవారి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. వైభవంగా విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. బుధవారం సాయంత్రం రెండు గ్రామాల పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, అమ్మవారి పాదాలు, కిరీటం, గరగలు మహిళలు ఊరేగించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఆయా కార్యక్రమాల్లో గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ, మొగలపల్లి వెంకట సత్యనారాయణ, గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, నారాయణరావు, జెర్రిపోతుల వెంకట్ పాల్గొన్నారు.

7న ఉచిత కంటి పరీక్షలు

అనకాపల్లిటౌన్ : మండలంలో గోపాలపురం గ్రామంలో రామాలయం వద్ద ఈనెల 7న శంకర్ ఫౌండేషన్, రాజా ఆప్టికల్ వారి ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి 2 గంటల వరకూ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి గోవాడ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని, అవసరమైన రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని తెలిపారు.

కంటి శిబిరానికి వచ్చే రోగులు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని ఆయన కోరారు. కేటరాక్ట్ ఆపరేషన్ అవసరమైన రోగులు సుగర్, రక్తపోటు, ఆయాసం రోగులు గతంలో వైద్యులు రాసిన మందుల చీటీని తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.

రైతుల భూముల్ని పరిరక్షించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోవిందు

రావికమతం : గ్రానైట్ క్వారీ నిర్వాహకుల నుంచి జీడిమామిడి రైతుల భూముల్ని పరిరక్షించాలన్న డిమాండ్‌తో త్వరలో నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద్ పిలుపునిచ్చారు. ఉర్లోవకొండ రెవెన్యూ పరిధిలోని 400 ఎకరాల్లో 350 మంది రైతులు ఏళ్ల తరబడి జీడిమామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. ఎంఎస్ లక్ష్మీనరసింహ గ్రానైట్ క్వారీ నిర్వాహకులు తమకు ప్రభుత్వ అనుమతులున్నాయంటూ వారు పొందిన భూములతో పాటు రైతుల భూములనూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా క్వారీ నిర్వాహకులు వెనక్కి తగ్గకపోవడంతో, సత్యాగ్రహ దీక్ష చేసేందుకు ఆ ప్రాంత రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రానైట్ క్వారీ నిర్వాహకులు అనుమతులు పొందిన భూముల చుట్టూ కంచె వేసుకోవాలని, రైతుల భూముల జోలికి రావద్దంటూ హెచ్చరించారు. గోవిందుతో పాటు రైతులు లక్ష్మి, సాలం రాజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ప్రాధాన్యాన్ని గుర్తించండి



పోషకాహార ప్రాధాన్యతను వివరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో బుధవారం విజయవాహిని ఛారటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోషకాహారం వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యూట్రిషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పూజ, పీజీ విద్యార్థులు పోషకాహార ప్రాధాన్యాన్ని వివరించారు. పోషకాహారం అందుబాటులో ఉన్నప్పటికీ కొందరు పట్టించుకోవడం లేదని, తద్వారా అనారోగ్యానికి కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఆట, పాటల ద్వారా పోషక ఆహార విలువల్ని తెలియపరిచే ప్రయత్నం చేశారు. సాయి చరణ్, హారిక, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

యలమంచిలి : ఈ నెల 13వ తేదిన యలమంచిలి కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించుకోవాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యలమంచిలి కోర్టులో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదా, ప్రీ లిటిగేషన్, బ్యాంకు అప్పులు, టెలిఫోన్ బకాయిలు, ఇంటి పన్ను బకాయిలకు సంబంధించిన కేసుల్లో రాజీ మార్గమే రాజమార్గం అని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టుల్లో చెల్లించిన రుసుము తిరిగి తీసుకునే అవకాశం ఒక్క లోక్ అదాలత్‌లో మాత్రమే ఉంటుందని, ధన వ్యయం, సమయం కాలం వృధా చేసుకోకుండా కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



అరబుపాలెంలో పర్యటిస్తున్న డీపీవో శిరీషారాణి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అన్నారు. మండలంలోని అరబుపాలెంలో ఆమె బుధవారం పర్యటించారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమణ, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.